క్లుప్తంగా

హెచ్‌సీఎల్ టెక్ -బికి 17 మంది ఎంపిక



ఎం.అప్పలనాయుడు

పరవాడ: తానాం బీసీ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, ఎంఈసీ గ్రూపులు చదువుతున్న 17 మంది విద్యార్థినులు హెచ్‌సీఎల్ పరిశ్రమలో హెచ్‌సీఎల్ టెక్-బి ప్రొగ్రామ్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు చెప్పారు. ఎంపికైన విద్యార్థినులకు ఏడాది పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశం కల్పిస్తారని చెప్పారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకున్న విద్యార్థినులకు పరిశ్రమ యాజమాన్యం సహకారం అందిస్తుందని తెలిపారు. పిన్న వయస్సులోనే ఉద్యోగం సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించింది.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు



అభిషేకం అందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెం ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

'మా నాయనే.. వెతుక్కుని వచ్చి పెన్షన్ ఇచ్చావా'



ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో సన్యాసమ్మకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ, ప్రగడ వాసు

అల్లిపురం: 'మా నాయనే నన్ను వెతుక్కుని వచ్చి పెన్షన్ ఇచ్చావా' అంటూ పెదవాల్తేరుకు చెందిన సామాజిక పింఛన్ లబ్ధిదారు సన్యాసమ్మ ఆనందం వ్యక్తం చేసింది. నెల రోజుల క్రితం సన్యాసమ్మ కుమారుడిని కాలికి వైద్యం నిమిత్తం టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ సిబ్బంది కేజీహెచ్‌లో చేర్పించారు. రోడ్డు పక్కన చిన్న పరదాతో కట్టుకున్న గుడిసెలో ఉన్న ఆమెను చూసేవారు లేకపోవడంతో ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఒకటో తేదీ రావడంతో తనకు పెన్షన్ రాదేమోనని భయపడుతున్న ఆమెకు మంగళవారం ఉదయం ఈస్ట్ పాయింట్ కాలనీ సచివాయం వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ వలంటీర్‌తో వచ్చి ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో ఫించన్ మొత్తం రూ.2,750 అందజేశారు. దీంతో సన్యాసమ్మ ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసింది.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీమణులు

సీతంపేట: నారీ భేరి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక పౌరగ్రంథాలయంలో వైశాఖమాసం వసంతగానం పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. పెమ్మరాజు రామ్, శైలజా మెరాజ్ పాడిన చల్లని గాలి చక్కని తోట, వీవీ చారి, సీవీ రాజేశ్వరి పాడిన ఏదో పిలిచినది, పుండరీకుమార్, భాగ్యలక్ష్మి పాడిన ఇక్కడే కలుసుకున్నాము, వెంకటరెడ్డి, శైలజ పాడిన ఆనందోబ్రహ్మ, రాజేశ్వరి, నాయుడు పాడిన లలిత ప్రియ కమలం, ఎంవీఆర్ నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి, సీవీ రాజేశ్వరి పాడిన చల్లని రాజా ఓ చందమామ గీతాలు ప్రేక్షకులను అలరించాయి. వీరికి కీబోర్డుపై సోమేష్, తబలాపై బీవీ రమణమూర్తి, ప్యాడ్స్‌పై విజయ్, గిటారుపై నాగు పాటకు తగ్గ వాయిద్య సహకారం అందించారు. ఎంవీఆర్ నాగేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పాలిటెక్నిక్‌లో ఘనంగా ఉద్యోగ విజయోత్సవం
- ఉద్యోగార్థులకు నియామక పత్రాలు అందజేత



విద్యార్థులకు ప్లేస్‌మెంట్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సింహాచలం: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేద విద్యార్థులకు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాణ్యమైన విద్య అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవాన్ని(జాబ్ అచీవర్స్ డే) ఘనంగా నిర్వహించారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివి వివిధ కంపెనీల్లో క్యాంపస్ ఉద్యోగాలు సాధించిన 70 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ విద్యార్థి చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులతో రూ.8 కోట్లతో నిర్మించిన కళాశాల నూతన భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యం పెట్టుకుని దాన్ని సాధించేందుకు కష్టపడి పని చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాల్లో చదువుతున్న 3500 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఐదు రెట్లు పెరిగిందన్నారు. పెందుర్తి కళాశాల నుంచి పది పరిశ్రమల్లో 94 ఉద్యోగాలకు 70 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కొందరికి రెండేసి ఉద్యోగాలు కూడా వచ్చాయన్నారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతిక విద్యనభ్యసించడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పలు పరిశ్రమల ప్రతినిధులు కె.విశ్వనాథ్, టి.సూర్యస్వరూప్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంపెనీ	ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల సంఖ్య
ఆదిత్య డైర్ టెక్ ప్రైవేట్‌లిమిటెడ్(విశాఖపట్నం)	4
అమరావతి పవర్ అసోసియేట్స్(విశాఖపట్నం)	22
ఆర్సలర్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్(సూరత్,గుజరాత్)	4
ఎఫ్టానిక్స్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్(మంగళగిరి)	3
మ్యాక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(విశాఖపట్నం)	2
రాయల్ ఎన్‌ఫీల్డ్(చెన్నై)	39
సమీర్(విశాఖపట్నం)	2
త్రివేణి రెన్యువబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్(కొవ్వూరు)	7
యల్లాస్ టెక్నాలజీస్(విశాఖపట్నం)	01
లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్(విశాఖపట్నం)	10

సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్ల వినతి



ప్రభుత్వ వైద్యుడికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు



డాక్టర్ చక్రవర్తికి ఆశ కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న ప్రభావతి తదితరులు

పరవాడ: ఆశ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు వెన్నల లక్ష్మి డిమాండ్ చేశారు.సీఐటీయూ ఆధ్వర్యంలో వాడచీపురుపల్లి, పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ ఆశ కార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాబ్ చార్టులు మంజూరు చేసి అదనపు పనులు అప్పగించకూడదని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి పని ఒత్తిడి తగ్గించాలన్నారు. సబ్ సెంటర్‌కు నిత్యం వెళ్లి సంతకం చేసే పద్ధతిని తొలగించాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పరవాడ ప్రభుత్వ వైద్యుడు ఐ.ఆర్ రంజిత్‌కు అందజేశారు. ధర్నాలో యూనియన్ కార్యదర్శి ఎ. వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సత్యవతి, లక్ష్మి,మాని, జయ, మాణిక్యం పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం: అపరిష్కృతంగా ఉన్న ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ఐద్వా అధ్యక్షురాలు బి. ప్రభావతి డిమాండ్ చేశారు. మండలంలోని ఆశ వర్కర్లతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ముందుగా పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు ఎం. గౌరేషు, ఆశ వర్కర్లు డి. భవాని, జి శ్రీకాంతి, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

'పోస్టల్ సంఘాల గుర్తింపు రద్దు అప్రజాస్వామికం'



భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్న సభ్యులు

డాబాగార్డెన్స్: అర్థం లేని కారణాలతో పోస్టల్ ఉద్యోగ సంఘాల గుర్తింపును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అప్రజాస్వామికమని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, ఆలిండియా బీఎస్ఎన్ఎల్/డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడి సంఘాల గుర్తింపును కొనసాగించాలంటూ మంగళవారం డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా యూనియన్ల సభ్యులు మాట్లాడుతూ ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ సంఘాలకు పోస్టల్ శాఖలో 70 శాతం పైగా సభ్యుల బలం ఉందని, వాటి గుర్తింపును 5 శాతం బలం కూడా లేని ఓ సంఘం ఫిర్యాదుతో గుర్తింపు రద్దు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఆ రెండు సంఘాల గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈసీహెచ్‌వీ సాగర్, సురేష్, పెంటయ్య, ఇళ్లపు రెడ్డి, శర్మ, మీనాకుమారి, రాధ, మంజుల, గోవిందరావు, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వంగలిలో వీధి కుక్కల బీభత్సం

- 132 నాటుకోళ్లపై దాడి

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలో వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. పలువురు రైతులకు చెందిన నాటుకోళ్లను పీక్కుతున్నాయి. సుమారు 132 వరకు నాటు కోళ్లు చనిపోయాయి.వీటి విలువ రూ.40 వేలకు పైనే ఉంటుందని రైతులు,గ్రామస్తులు తెలిపారు. చనిపోయిన వాటిలో కె. రమణ, గొర్లి రాము, జెట్టి వెంకటస్వామి, గొటివాడ ఈశ్వరరావు, చైతన్య కుమార్‌కు చెందిన కోళ్లు ఉన్నాయి. ఈ ఘటనతో గ్రామస్తులు భయపడ్డారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తమకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.



వంగలిలో వీధికుక్కల దాడిలో మృత్యువాత పడిన నాటు కోళ్లు

వైభవునికి లక్షమల్లెలతో అర్చన

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. ఉదయం స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వైభవ వేంకటేశ్వరుడికి లక్ష మల్లెలు సమర్పించారు. సాయంత్రం సదస్యోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నగరానికే 'గైస్' గర్వకారణం

మేయర్ హరివెంకటకుమారి



అధ్యాపకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ హరివెంకట కుమారి



పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మురళీనగర్: పాలిటెక్నిక్ స్థాయిలో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ నూరు శాతం ఉద్యోగాలు సాధించడం విశాఖ నగరానికే గర్వకారణమని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్‌కాలేజీ (గైస్)లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక ఏడాదిలో 243మంది ఉద్యోగాలు సాధించడం రాష్ట్రంలోనే ఒక రికార్డు కాగా వీరిలో 54మంది బాలికలు ఉండడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా హెచ్‌పీసీఎల్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలో 85మంది ఉద్యోగాలు సాధించడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గైస్ విద్యార్థిని డి.వంశీప్రియాంక ఏషియన్ పెయింట్స్‌లో అత్యధిక ప్యాకేజీ రూ.6.73లక్షలు పొందిన మొట్టమొదటి విద్యార్థినిగా రికార్డు సాధించిందని ఆమె ప్రశంసించారు. వీరిని జూనియర్స్ ఆదర్శంగా తీసుకుని ఉన్నత అవకాశాలు పొందాలని ఆమె ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశలతో పాటు తమ ఆశయాలు నెరవేర్చుకునేందుకు విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. ఇలాంటి జాబ్ అచీవర్స్ ఉత్సవాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయన్నారు. ప్రత్యేక అతిథి, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజనీ ఈశ్వరరావు మాట్లాడుతూ తమ వార్డులోని కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉద్యోగాల సాధనలో రికార్డు సృష్టించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ తమ కాలేజీకి ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతోపాటు ప్రిన్సిపాల్‌గా గ్లోబల్ అచీవ్‌మెంటు అవార్డు, ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్, గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డులు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన 243మందికి మేయర్ హరి వెంకటకుమారి, కార్పొరేటరు రజనీ ఈశ్వరరావు నియామక పత్రాలు అందించారు. అనంతరం తల్లిదండ్రులను, ప్రిన్సిపాల్ వెంకటరమణను సత్కరించారు. ముందుగా లవ్ గైస్ లోగోను మేయర్ హరివెంకట కుమారి కార్పొరేటర్ రజనీ ఈశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీఈ లోకల్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓ.రామమోహన్‌రావ్, కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, సభ్యులు డాక్టర్ బోకం దేముడు, యూఎస్ శర్మ, బీఎస్ రామమోహన్, కెమికల్ ఇంజినీరింగు హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు సీహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, ఓఎస్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

14న హనుమజ్జయంతి

డాబాగార్డెన్స్: మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 14న హనుమజ్జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. ఆ రోజు ఉదయం 5 గంటలకు నాదస్వర కచేరితో ప్రభాత సేవ, 5.30 నుంచి 7.30 గంటల వరకు స్వామికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి దర్శనాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామి దర్శనాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఆలిండియా రేడియో ఆర్టిస్ట్ కొండూరి గాయత్రిచే భక్తి రంజని కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులు కౌంటర్‌లో రూ.216 చెల్లించాలని తెలిపారు.

ఉత్సాహంగా గడప గడపకు..



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే ధ్యేయంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 97వ వార్డు పరిధి కిషోర్ లేఅవుట్, లక్ష్మీనగర్‌లో ఎమ్మెల్యే మంగళవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అవి ఏవిధంగా అందించాలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, ఆయా కాలనీల అసోసియేషన్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ పండగ



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



దుర్గమాంబ అమ్మవారు

సబ్బవరం: సబ్బవరం ప్రజల ఆరాధ్య దైవం శ్రీదుర్గమాంబ అమ్మవారి పండగ ను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి సబ్బవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు చీరలు,పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.ఉచిత ప్రసాద వితరణ చేశారు. అనుపు మహోత్సవంలో భాగంగా రాత్రికి నిర్వహించిన ఊరేగింపులో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన బాణ సంచా కాల్పులు, విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకున్నాయి.

ముత్యాలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు



పరవాడలో కొలువుదీరిన బ్రాహ్మణి ముత్యాలమ్మతల్లి

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో కొలువుదీరిన శ్రీ బ్రాహ్మణి ముత్యాలమ్మతల్లి ఉత్సవాన్ని ఈ నెల 4న వైభవంగా జరపడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో షామియానాలు వేశారు. పండగ రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. గురువారం రాత్రి డప్పువాయిద్యాలు, డ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్లు, కోలాటాల మధ్య అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం భారీ బాణ సంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు చెప్పారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

- విశేషంగా మహా పూర్ణాహుతి



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్ తదితరులు



ద్వాదశి ఆరాధన నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై ఐదు రోజులుగా జరిగిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు ఆలయంలో పలు విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారి చక్రస్నాన మహోత్సవం..సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి,భూదేవిల చెంత పలు రకాల పుష్పాలతో శ్రీ పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. మహా పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ద్వాదశారాధన, విశేష అర్చనలు, ఉంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు పూజలు చేశారు.

రెండేళ్లలో మూడు లక్షల ఉద్యోగాలు

మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందిస్తున్న మారిటైమ్ బోర్డు చైర్మన్ వెంకటరెడ్డి

మురళీనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చర్యల వల్ల రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో యువతకు మూడు లక్షల ఉద్యోగాలు వస్తాయని మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ విజయో త్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేవలం పాలిటెక్నిక్ విద్యార్థులకు లక్ష ఉద్యోగాలు వస్తాయన్నారు. విశాఖ పోర్టులోనే 25వేలు ఉద్యోగాలు వస్తాయన్నారు. డిప్లమో విద్యార్థులు కోర్సుల పూర్తి కాగానే వచ్చే ఉద్యోగావకావకాశాలను వదులుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలు వీలైనంత త్వరగా జీవితంలో స్థిరపడే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జాబ్ మేళా సలహాదారు గాది శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కంపెనీల్లో చేరిన వారు నిబద్ధతతో పని చేస్తే అత్యధిక ప్యాకేజీలు వస్తాయన్నారు. డిప్లమో అనంతరం ఉన్నత విద్యకు వెళ్లడం కన్నా ఉద్యోగాల్లో చేరడం తెలివైన పనిగా ఆయన పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ అసిస్టెంటు కమిషనర్ ఎ.త్రినాథరావు మాట్లాడుతూ సైబర్ క్రైం పై విద్యార్థులు అప్రమత్తతతో ఉండాలన్నారు. ఉద్యోగాలు పొందిన 172 మంది విద్యార్థులకు మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో హేమ ఎడ్‌టెక్స్ చైర్మన్ బి.సురేష్‌కుమార్, ఎస్‌బీటీఈటీ అకడమిక్ సంయుక్త కార్యదర్శి జీవీవీ సత్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు పాల్గొన్నారు. ముందుగా మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారు గాది శ్రీధర్‌రెడ్డి కాలేజీలోని స్కిల్ హబ్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు.